# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710


తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 1- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 58 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## రేషన్ కార్డుదారులకు భారీ ఊరట

- ఈ-కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు
- రాష్ట్రవ్యాప్తంగా గడువు పొడిగింపు
- శనివారం నుంచి మూడు నెలల రేషన్ పంపిణీ
- ఈ-కేవైసీ లేకున్నా బియ్యం పంపిణీ




హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు ఇచ్చిన గడువును ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారంతో గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

మిగతా 2లో

## హైడ్రాపై హైకోర్టు ఆదేశం

- రంగనాథ్ స్థానంలో నియామకానికి ఆదేశం
- ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు
- కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై చర్య
- చట్టబద్ధ పాలనకే ప్రాధాన్యం



హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు మరో కీలక ఆదేశం జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించిన నేపథ్యంలో ఆయన స్థానంలో మరొక అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం తక్షణ చర్యలు

మిగతా 2లో

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- 'నషా ముక్త్ భారత్'కు సీతక్క పిలుపు
- మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాలని సూచన
- వ్యసన విముక్త సమాజ నిర్మాణమే లక్ష్యమని వెల్లడి
- 10 కోట్ల మంది ప్రతిజ్ఞలో భాగస్వామ్యం కావాలని పిలుపు



హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాలు వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

మిగతా 2లో

## విదేశీ ఉద్యోగాలపై సీఎం కీలక ఆదేశాలు

- టామ్‌కాం ద్వారా ఉపాధి, పాస్‌పోర్టు సేవలు విస్తరించాలని సూచన
- విదేశీ భాషలు, డ్రైవింగ్ శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య విశ్వవిద్యాలయంపై సీఎం సమీక్ష
- నర్సింగ్, విద్యుత్ వాహనాలు, డ్రోన్ కోర్సులు ప్రవేశపెట్టాలని సూచన



హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

విదేశాల్లో ఉద్యోగాలు పొందాలనుకునే యువతకు అవసరమైన శిక్షణ, ఉద్యోగ మేళాలు, పాస్‌పోర్టు సౌకర్యాలు, విదేశీ ఉపాధి అవకాశాల కల్పన బాధ్యతలను తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థకు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉత్తర తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మధ్యప్రాచ్య దేశాలకు ఉపాధి కోసం వెళ్తున్న నేపథ్యంలో వారు మోసపూరిత ఏజెంట్ల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. విదేశీ మానవ వనరుల సంస్థ ద్వారా వివిధ దేశాల మానవ వనరుల సంస్థలతో ఒప్పందాలు కుదుర్చి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, విదేశాల్లో సమస్యలు ఎదురైతే వారికి న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో

## పెద్దికి అధికారిక వీడ్కోలు

### నల్లబెల్లిలో అధికారిక లాంఛనాలు
### అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
### పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు
### పలువురు నేతల నివాళులు



వరంగల్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఉద్యమకారుడు, భారత రాష్ట్ర సమితి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఆయన స్వగ్రామం వరంగల్ జిల్లా నల్లబెల్లిలో అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజల అశ్రునయనాల మధ్య అంతిమ సంస్కారాలు పూర్తయ్యాయి. పెద్ది సుదర్శన్‌రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు తరలిరావడంతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. అంత్యక్రియలకు ముందు ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామంలోని నివాసానికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు కడసారి దర్శించుకుని భావోద్వేగంతో నివాళులర్పించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతితో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది.

మిగతా 2లో

## పెద్ది మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

- ఆప్త మిత్రుడిని కోల్పోయానన్న కేసీఆర్
- పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా
- ఉద్యమ సహచరుడికి భావోద్వేగ నివాళి
- బీఆర్ఎస్‌కు తీరని లోటని వ్యాఖ్య




2లో

## పెద్ది మృతిపై సీఎం సంతాపం

- మాజీ ఎమ్మెల్యే మృతిపై దిగ్భ్రాంతి
- తెలంగాణ ఉద్యమంలో సేవలను కొనియాడిన సీఎం
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
- ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొంటూ, తెలంగాణ ఉద్యమంలో

మిగతా 2లో

## అందుబాటులో కుటుంబ ధ్రువీకరణ పత్రం

- తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో జారీ
- కుటుంబ వివరాల కోసం ప్రత్యేక ధ్రువీకరణ పత్రం
- ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయం
- ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్ర ప్రజలకు అవసరమైన కుటుంబ వివరాలను ఒకే ధ్రువీకరణ పత్రం ద్వారా అందించేందుకు ప్రభుత్వం కుటుంబ ధ్రువీకరణ పత్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో

మిగతా 2లో



## ఆయిల్ పామ్‌పై మంత్రి సీరియస్

- ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించబోమని మంత్రి తుమ్మల హెచ్చరిక
- లక్ష్యాలు చేరని కంపెనీలపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధం
- మొక్కల కొరత లేకుండా రైతులకు సకాలంలో సరఫరా చేయాలని ఆదేశం
- ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం వేగవంతం చేయాలని కంపెనీలకు సూచన

2లో

## టీఆర్ టీయూ లోగో ఆవిష్కరణ

- తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ లో wwగోను ఆవిష్కరించిన కవిత
- కార్మికుల హక్కుల పరిరక్షణే టీఆర్ టీయూ లక్ష్యమని వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సమస్యలపై ఉద్యమిస్తామని ప్రకటన
- కోటిన్నర మంది కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని స్పష్టం

హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్ టీయూ) లోగోను బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టీఆర్ టీయూ పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పెద్దికి అధికారిక వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క), బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని నివాళుల సందర్భంగా అభిప్రాయపడ్డారు. గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన మరణవార్తతో కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అధికారిక లాంఛనాల మధ్య నిర్వహించిన అంత్యక్రియలతో పెద్ది సుదర్శన్‌రెడ్డికి తుది వీడ్కోలు పలికారు. ఆయన మరణం తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్న వర్గాల్లో తీరని లోటుగా మిగిలిందని పలువురు నాయకులు పేర్కొన్నారు.

# పెద్ది మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి

**హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిపై భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. తానొక ఆప్త మిత్రుడిని, ఉద్యమ సహచరుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ, పెద్ది కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పెద్ది ప్రాణాలను కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన కృషి ఫలించకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ పరిణామం తనకు తీవ్ర మనోవేదన కలిగించిందని తెలిపారు.

తెలంగాణనే శ్వాసగా భావిస్తూ నీతి, నిజాయతీతో ప్రజా జీవితాన్ని కొనసాగించిన నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అని కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ ఉద్యమ లక్ష్యాల సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేటలో భారత రాష్ట్ర సమితి జెండాను ఎగురవేసిన ధీరుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డిని కేసీఆర్ అభివర్ణించారు. ఉద్యమ కాలం నుంచి చివరి శ్వాస వరకు గులాబీ జెండా నీడలోనే ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగిందని గుర్తు చేశారు. పార్టీ బలోపేతానికి ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు.

ఉద్యమంలోనూ, నియోజకవర్గ అభివృద్ధిలోనూ పెద్ది తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని కేసీఆర్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన సేవలందించారని పేర్కొన్నారు. పార్టీపట్ల అపారమైన విధేయతతో, అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం భారత రాష్ట్ర సమితికి తీరని లోటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను పార్టీ కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పెద్ది అందించిన సేవలు, ఉద్యమ స్ఫూర్తి పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొంటూ ఆయనకు ఘన నివాళులర్పించారు.

# పెద్ది మృతిపై సీఎం సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలు ప్రజలకు, ఉద్యమ చరిత్రకు చిరస్మరణీయమని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో చురుకుగా పాల్గొని విశేష సేవలందించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజా జీవితంలో కొనసాగుతూ ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు. ఆయన మరణం రాజకీయ రంగానికి, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డిని గుర్తు చేసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ముఖ్యమంత్రి ప్రార్థించారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పెద్ది కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా జీవితంలో అందించిన సేవలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన కృషి చిరకాలం గుర్తుండిపోతాయని ముఖ్యమంత్రి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# టీఆర్ టీయూ లోగో ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని కోటిన్నర మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల సాధన కోసం ట్రేడ్ యూనియన్ ఉద్యమిస్తుందని కవిత తెలిపారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తామని చెప్పారు.

కార్మికులు ఎదుర్కొంటున్న వేతనాలు, ఉపాధి భద్రత, సామాజిక రక్షణ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై టీఆర్ టీయూ ప్రత్యేకంగా పనిచేస్తుందని ఆమె వివరించారు. కార్మిక వర్గం బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. కార్మికులకు అవసరమైన చట్టపరమైన రక్షణ కల్పించడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, హక్కుల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడడం టీఆర్ టీయూ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన కార్మికులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాల బలోపేతానికి టీఆర్ టీయూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. టీఆర్ టీయూ ఆవిర్భావంతో కార్మికుల హక్కుల పరిరక్షణకు కొత్త వేదిక ఏర్పడిందని, రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంక్షేమం కోసం ఉద్యమాన్ని విస్తృతం చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

# రేషన్ కార్డుదారులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)


దీంతో ఇప్పటివరకు వివిధ కారణాలతో ఈకేవైసీ పూర్తి చేయలేకపోయిన లక్షలాది మంది రేషన్ కార్డుదారులకు మరో నెల రోజుల గడువు లభించింది. వాస్తవానికి ఈకేవైసీ గడువు పొడిగింపును తొలుత హైదరాబాద్ మహానగర పరిధిలోని లబ్ధిదారులకు మాత్రమే వర్తింపజేయాలని ప్రభుత్వం భావించింది. అయితే జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున విజ్ఞప్తులు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం కొనసాగుతున్న 'స్మార్ట్' ప్రక్రియతో పాటు పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు రేషన్ దుకాణాలకు వెళ్లలేకపోతున్న పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయని వారి రేషన్ కార్డులు రద్దు కావొచ్చన్న ప్రచారం నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రభుత్వం గడువు పొడిగించడంతో ఆందోళనకు తెరపడింది. ఆగస్టు 31లోపు సమీపంలోని చౌకధరల దుకాణానికి వెళ్లి వేలిముద్రల ధ్రువీకరణతో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. కుటుంబంలోని ప్రతి సభ్యుడి వివరాలను ధ్రువీకరించుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా రేషన్ కార్డుదారులకు మరో శుభవార్తను కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఈకేవైసీ పూర్తయిందా లేదా అన్న విషయంతో సంబంధం లేకుండా శనివారం నుంచి మూడు నెలలకు సంబంధించిన బియ్యం, ఇతర నిత్యావసర రేషన్ సరుకులను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించింది. దీంతో ఈకేవైసీ పూర్తికాలేదన్న కారణంతో రేషన్ నిలిపివేస్తారనే అనుమానాలకు పూర్తిగా తెరపడింది.

వాతావరణ పరిస్థితులు, సరఫరా వ్యవస్థ నిర్వహణ, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మూడు నెలల రేషన్‌ను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, రాబోయే రోజుల్లో ఏర్పడే ప్రతికూల పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రేషన్ దుకాణాల వద్ద తగిన నిల్వలు ఉంచి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఈకేవైసీ ఇంకా పూర్తి చేయని లబ్ధిదారులు గడువు ముగిసేలోపు తప్పనిసరిగా సమీప రేషన్ దుకాణంలో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి అర్హ కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది రేషన్ కార్డుదారులకు గణనీయమైన ఊరట లభించింది.

# విదేశీ ఉద్యోగాలపై సీఎం కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)



విదేశాలకు కార్మికులను పంపిస్తున్న ఏజెంట్ల వివరాలను నమోదు చేయాలని, వారి ద్వారా వెళ్లే ప్రతి వ్యక్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థకు మాజీ విదేశాంగ సేవల అధికారిని ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా నియమించాలని ప్రతిపాదించారు. విదేశీ ఉద్యోగాలకు వెళ్లే వారికి తేలికపాటి, భారీ వాహనాల నడపడంలో ప్రత్యేక శిక్షణ అందించాలని చెప్పారు. యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయంలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర విదేశీ భాషల బోధన కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ఆయా దేశాల నుంచి శిక్షకులను ఆహ్వానించి శిక్షణ అందించాలని సూచించారు. బ్లూ కాలర్ ఉద్యోగాలకు శిక్షణ పొందే వారికి కూడా ఉపకార వేతనాల కల్పనపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, ఆధునిక శిక్షణ కేంద్రాలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. చదువుతో పాటు శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనం లభించడంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల మరమ్మతు సేవలు, డ్రోన్ సాంకేతికతకు సంబంధించిన కోర్సులను ఆధునిక శిక్షణ కేంద్రాల్లో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ నర్సింగ్ సేవలకు భారీ డిమాండ్ ఉన్నందున అవసరాలకు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి రంగంలో సమగ్ర మార్పులు తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు.

# అందుబాటులో కుటుంబ ధ్రువీకరణ పత్రం

(మొదటి పేజీ తరువాయి)

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సంఘం ఉపాధ్యక్షుడు ఫహీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాల ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు ఇప్పటికే ప్రభుత్వ వద్ద నమోదు అయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని కుటుంబ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఏ కుటుంబమైనా తమ కుటుంబ సభ్యుల వివరాలు అవసరమైనప్పుడు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాన్ని సందర్శించి కుటుంబ ధ్రువీకరణ పత్రాన్ని పొందవచ్చని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సేవతో ప్రజలు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు అవసరమైన కుటుంబ వివరాలను సులభంగా సమర్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు లేదా ఇతర సంస్థలు కుటుంబ సభ్యుల వివరాలను కోరినప్పుడు ఈ ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క వివరించారు. ఒకే పత్రం ద్వారా కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించే విధంగా ప్రభుత్వం ఈ సేవను రూపొందించిందని తెలిపారు.

ప్రజలకు సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గేలా, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సులభంగా పొందే విధంగా సేవలను విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో కుటుంబ ధ్రువీకరణ పత్రం అందుబాటులో ఉందని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకుని పొందవచ్చని తెలిపారు.

# ఆయిల్ పామ్‌పై మంత్రి సీరియస్

**హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ఈ మేరకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైందని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది లక్ష్యంలో కేవలం 20 శాతం మాత్రమేనని పేర్కొంటూ, ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ కంపెనీల పనితీరులో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. రైతులు ముందుకొస్తుంటే కంపెనీలు వెనుకబడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. లోహియా, ఆయిల్ ఫెడ్, తిరుమల, ప్రియూనిక్, రామ్ చరణ్, గోద్రెజ్, విశ్వతేజ్, కేన్ బయో, పతంజలి, మాట్రిక్స్, సువేన్ ఆగ్రో సంస్థలకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా తగిన మార్పు కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై లక్ష్యాలను సాధించని కంపెనీలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పనితీరు మెరుగుపరచని కంపెనీల పరిధిలోని జిల్లాలను తగ్గించడానికైనా, అవసరమైతే పూర్తిగా తొలగించడానికైనా ప్రభుత్వం వెనుకాడదని మంత్రి స్పష్టం చేశారు. మెరుగైన పనితీరు కనబరిచే సంస్థలకు అదనపు జిల్లాల బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కూ ఎలాంటి మినహాయింపు ఉండదని, పురోగతి లేకుంటే దాని పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు అప్పగిస్తామని హెచ్చరించారు.

ఆగస్టు నెలలో మొక్కల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కంపెనీలను మంత్రి ఆదేశించారు. అవసరమైతే ఇతర సంస్థల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి సంస్థ సిద్ధంగా ఉండాలని, మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో ఫీల్డ్ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సాగు విధానాలు, ఎరువుల వినియోగం, పంట సంరక్షణపై నిరంతరం మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతుల రవాణా వ్యయం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించేందుకు అన్ని కంపెనీలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

# హైడ్రాపై హైకోర్టు ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని స్పష్టం చేసింది. లోతుకుంట భూముల వివాదానికి సంబంధించిన కేసులో హైడ్రా, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ మధ్య కొనసాగుతున్న వ్యవహారాన్ని విచారించిన హైకోర్టు, గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించినట్లు పేర్కొంది. వివాదాస్పద భూమిలో యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధమని తేల్చిచెప్పింది.

ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు గతంలోనే హైకోర్టు అభిప్రాయపడింది. న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయాల్సిన అధికారులు వాటిని పాటించకుండా వ్యవహరించడం చట్టబద్ధ పాలనకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా టాటా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ప్రస్తావించింది. దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని, ప్రతి అధికారి న్యాయస్థానాల ఆదేశాలను తప్పనిసరిగా గౌరవించాలని స్పష్టం చేసింది.

వ్యక్తుల ఆధిపత్యం చట్టపరమైన వ్యవస్థపై పైచేయి సాధించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హైకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. చట్టం ముందు అందరూ సమానమేనని, న్యాయస్థానాల ఉత్తర్వులను ఉల్లంఘించే చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించింది. రంగనాథ్ స్థానంలో కొత్త అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు, ఈ నిర్ణయాన్ని త్వరితగతిన అమలు చేయాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు అధికార యంత్రాంగంలో న్యాయస్థానాల ఆదేశాల అమలుకు ఉన్న ప్రాధాన్యాన్ని మరోసారి చాటిచెప్పింది.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రతిజ్ఞలో 10 కోట్ల మంది పాల్గొనే కార్యక్రమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని సీతక్క విజ్ఞప్తి చేశారు. ఈ ఉద్యమం ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించవచ్చని తెలిపారు.

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొన్న ఆమె, ఈ వ్యసనానికి బానిసైన వారిని చిన్నచూపు చూడకుండా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి సమాజం సహకరించాలని సూచించారు. వ్యసన విముక్తి కోసం ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసి మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సీతక్క అన్నారు. యువతలో చైతన్యం పెంచడం ద్వారా వ్యసనాలను అరికట్టవచ్చని, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మాదకద్రవ్యాలపై అవగాహన పెంచడం, వాటి దుష్పరిణామాలను ప్రజలకు వివరించడం, వ్యసన బాధితులకు పునరావాసం కల్పించడం వంటి చర్యలు సమాంతరంగా సాగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సీతక్క పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' విజయవంతం కావడానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## కుమారికి కన్నీటి వీడ్కోలు.. పూలమాల వేసి



- నివాళులర్పించిన చైర్‌పర్సన్ సుహాసిని

**హుజురాబాద్, జూలై 31(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణానికి చెందిన ట్రాన్స్‌జెండర్ క్రీ.శే. రొంటాల కుమారి మృతితో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఆమె అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ట్రాన్స్‌జెండర్ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కుమారికి తుది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బోరాగాల మొగిలి, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, ట్రాన్స్‌జెండర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొని క్రీ.శే. రొంటాల కుమారికి ఘన నివాళులర్పించారు.

## ఎస్ఎస్‌సీలో 100 శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి



- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి,జూలై31(తెలంగాణ ముచ్చట్లు-):** రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో వనపర్తి జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకుండా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలలో నిర్వహించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక బోధన కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ఆగస్టు 12లోగా ఉపాధ్యాయులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. గణితం, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఆబ్జెక్టివ్ పరీక్షలు నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని తెలిపారు. వారికి మూడు నెలల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వ్యక్తిగత శ్రద్ధతో బలహీనతలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల పురోగతిని ఎప్పటికప్పుడు పరీక్షల ద్వారా అంచనా వేస్తూ అవసరమైన చోట అదనపు బోధన అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును సమీక్షించి, పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్లను వినియోగిస్తూ పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

## భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక

- గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరిక

**భద్రాచలం, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విస్టా కాంప్లెక్స్ స్లూయిస్, స్నాన ఘాట్లు, కరకట్ట, కూనవరం-భద్రాచలం రహదారి ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించి, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరగా, సుమారు 11.44 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం నమోదైనట్లు అధికారులు తెలిపారు. నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్య సదుపాయాలు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, జిల్లా విపత్తు స్పందన బృందాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.
వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలను మాత్రమే పాటించాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు గోదావరిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగరాదని ప్రజలను హెచ్చరించారు. సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం వరద నియంత్రణ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

# ఐదవ వార్డులో విస్తృతంగా మొక్కల పంపిణీ





- ప్రతి ఇంటికి ఒక మొక్క అందజేస్తూ హరితహారం లక్ష్యంగా కౌన్సిలర్ సొల్లు సునీత

**హుజురాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సంకల్పంతో హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డులో శుక్రవారం విస్తృత స్థాయిలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదవ వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత ఆధ్వర్యంలో వడ్డెర కాలనీ, రజకవాడ, గౌడ సంఘం కాలనీ, మాల సంఘం కాలనీతో పాటు వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మొక్కలను అందజేశారు.
ఈ సందర్భంగా కాలనీల్లో ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలను నాటి వాటి సంరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచాలని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని కౌన్సిలర్ సొల్లు సునీత పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె అన్నారు. వనమహోత్సవ కార్యక్రమం ద్వారా హుజురాబాద్ పట్టణాన్ని మరింత హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ప్రతి ఇంటి ఆవరణలో ఒక మొక్కను నాటి దానికి నిరంతరం నీరు పోస్తూ సంరక్షిస్తే పర్యావరణ సమతుల్యత కాపాడటంతో పాటు కాలుష్యాన్ని తగ్గించవచ్చని వివరించారు.
కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా సమాజానికి గొప్ప సేవ చేసిన వారమవుతామని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే హరిత హారం లక్ష్యాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో హనుమాన్ గుడి చైర్మన్ కొలిపాక శంకర్, కొండపాక భూపాల్, గాధం భాగ్యలక్ష్మి, వడ్డెర కాలనీ వాసులు, రజకవాడ, గౌడ సంఘం కాలనీ, మాల సంఘం కాలనీ ప్రజలు, యువకులు, మహిళలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# వేలేరు రాజరాజేశ్వరి వివో 22వ వార్షిక మహాసభ నిర్వహణ



**వేలేరు, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజరాజేశ్వరి పరస్పర సహాయక పొదుపు సంఘం వీవో 22వ వార్షిక మహాసభ సమావేశం వివో అధ్యక్షురాలు జోష్నా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో రెండు వివో భవనాలు పూర్తి చేశామని, మిగిలిన రెండు భవనాలకు కూడా త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత, ప్రతి వ్యవసాయ భూమిలో పంట కుంట ఏర్పాటు చేసుకోవాలని, ఇంకుడు గుంతకు గ్రామపంచాయతీ ద్వారా రూ.6,500 ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు వివరించారు.
అనంతరం మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు సర్పంచ్ బిల్లా యాదగిరి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం అనిత, ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి విజయ, సీసీ రమాదేవి, వీవోఏ లక్ష్మి, వివో కార్యవర్గ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి




**పెద్దమందడి,జూలై31(తెలంగాణ ముచ్చట్లు):** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని వనపర్తి జిల్లా పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. పిల్లల భద్రత అనేది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి తీసుకోవాల్సిన బాధ్యత అని అన్నారు.పెద్దమందడి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వాటి వినియోగం వల్ల ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తు పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**పెద్దమందడి,జులై(31తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామపంచాయతీ భవనంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గ్రామపంచాయతీ భవనానికి చేరుకుని, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే 99 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, 100 శాతం లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.మిగిలిన ప్రక్రియను కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, గ్రామ మాజీ అధ్యక్షుడు బాబు రెడ్డి, గట్టు యాదవ్, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, వడ్డె శేఖర్, వార్డు సభ్యులు నాగభూషణ్ ,బీఎల్ఏలు దిండు రవీందర్ ,మద్దూర్ నరసింహ,నవీన్,మద్దూరు వెంకటయ్య, గుండెల ఆంజనేయులు, దిండు వివేక్, కుమ్మరి కొండన్న రామచంద్రయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# జమ్మికుంట అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్.. 38 కీలక తీర్మానాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం




- **డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వినాయక నిమజ్జన ఏర్పాట్లకు గ్రీన్ సిగ్నల్**

**జమ్మికుంట, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన 38 కీలక ప్రతిపాదనలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్మన్ మెలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధి, పరిపాలనకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.
సమావేశంలో మున్సిపల్ కార్యాలయ వాహనాల మరమ్మతులు, శ్రీరామ హాస్పిటల్ నుంచి హోటల్ నరసయ్య ఇంటి వరకు డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం, వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో ఆర్‌సీసీ పైపుల కొనుగోలు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, బ్లేడ్ ట్రాక్టర్, జేసీబీ, లాడర్ మరమ్మతులకు ఆమోదం తెలిపారు.
రానున్న వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్ల అద్దె, జనరేటర్, టెంట్లు, స్టేజ్ ఏర్పాటు, పట్టణ రహదారులపై గుంతల పూడ్చివేత పనులకు కూడా కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు, ఇంటర్‌కామ్ కనెక్షన్లు, టీవీ ఏర్పాటు, గాంధీ చౌక్‌లోని జాతీయ జెండా స్థంభం మరమ్మతులు, జెండా ఆవిష్కరణ కార్యక్రమం కోసం రూ.1 లక్ష, వీధి దీపాల నిర్వహణకు అవసరమైన పీసీబీఎస్ సెన్సార్లు, డ్రైవర్లు, ఎల్‌ఈడీ లైట్లు తదితర సామగ్రి కొనుగోలుకు రూ.10 లక్షలు, పట్టణ హరితాభివృద్ధికి మొక్కల కొనుగోలు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది.
ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జావిద్, మున్సిపల్ కౌన్సిలర్లు, మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తరాలను తీర్చిదిద్దిన గురువుకు ఘన వందనం



- **దామెర సుధాకర్‌కు సన్మానం.**
- **నాలుగు దశాబ్దాల విద్యా సేవలకు గుర్తింపుగా ఘనంగా పదవీ విరమణ సత్కారం**

**జమ్మికుంట టౌన్ జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** నాలుగు దశాబ్దాల పాటు విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన జమ్మికుంట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర సుధాకర్ పదవీ విరమణ సందర్భంగా ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. విద్యార్థుల అభ్యున్నతి, క్రమశిక్షణ, నాణ్యమైన విద్య అందించడంలో ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు, అభిమానులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. విద్యా రంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, భవిష్యత్తులో కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి మాట్లాడుతూ, ఉపాధ్యాయుడి సేవలు తరగతి గది గోడలకే పరిమితం కావని, మంచి విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. దామెర సుధాకర్ అందించిన సేవలు జమ్మికుంట ప్రాంత విద్యా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడుతూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సుంకరి యాదయ్య, పాంతటి రవీందర్, ఎం.ఏ. రషీద్, కొంగల కుమార్, మారేపల్లి అజయ్ తదితరులు పాల్గొని దామెర సుధాకర్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్థంభంపల్లి చెరువు సురక్షితం

- **ప్రస్తుతం చెరువు కట్టకు ఎలాంటి ముప్పు లేదు**



**జగిత్యాల, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** వెల్గటూరు మండలంలోని స్థంభంపల్లి పెద్దచెరువు ప్రస్తుతం పూర్తిగా సురక్షితంగా ఉందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో చెరువుకు భారీగా వరద నీరు చేరినప్పటికీ, ప్రస్తుతం చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేశారు. జూలై 29న వెల్గటూరులో 175.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడంతో స్థంభంపల్లి పెద్దచెరువుకు భారీ వరద ప్రవాహం వచ్చింది. దీంతో చెరువు స్లూయిస్ సమీపంలో ఏర్పడిన సింక్‌హోల్ ప్రాంతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

# మరో వారం రోజుల్లో పెద్దమందడి–వనపర్తి రూ.40 కోట్ల రహదారి పనులు

- **సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం సహించం**
- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**




**పెద్దమందడి,జూలై31(తెలంగాణ ముచ్చట్లు):** సాంకేతిక కారణాలతో జాప్యమైన పెద్దమందడి-వనపర్తి ప్రధాన రహదారి నిర్మాణ పనులు మరో వారం రోజుల్లో ప్రారంభమవుతాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు.శుక్రవారం పెద్దమందడి మండల రైతువేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, వివిధ శాఖల పనితీరును సమీక్షించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.పెద్దమందడి-వనపర్తి రహదారి నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరైనప్పటికీ పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల మధ్య నెలకొన్న సాంకేతిక సమస్యల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొంటూ, వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.వ్యవసాయ శాఖ రైతులకు మరింత చేరువ కావాలని, యూరియా బుకింగ్ సమయంలో యాప్‌లో 'నో స్టాక్' సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు, సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు మట్టి, ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల రుణాల మంజూరులో జాప్యంపై ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గంలో గత 30 నెలల్లో విద్యుత్ శాఖ ద్వారా రూ.140 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.40 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల ఫిర్యాదులపై లైన్‌మెన్‌లు వెంటనే స్పందించాలని ఆదేశించారు. పనిచేయని వీధిలైట్లను తక్షణమే మరమ్మతు చేయాలని, నిర్లక్ష్యం వహించే గ్రామపంచాయతీలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.నీటి సంరక్షణకు ఉపయోగపడే ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల అందింపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.భూభారతి ద్వారా భూ సమస్యలకు దశలవారీగా పరిష్కారం లభిస్తుందని, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వారం రోజుల్లో ప్రారంభమవుతుందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అధికారులు కూడా అదే నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్, జడ్పీ సీఈఓ యాదయ్య, ఎంఈఓ మంజుల, ఎంపీడీవో పరిణత, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 77 వారాలుగా నిరంతర అన్నప్రసాద సేవ

- **మల్లారెడ్డిపల్లిలో అమ్మ ఫౌండేషన్ ఆదర్శం**



**వీణవంక, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ఆధ్వర్యంలో గత 77 శుక్రవారాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం శుక్రవారం 77వ వారంలోనూ భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాటిపెల్లి అజయ్ 25వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన తల్లి తాటిపెల్లి హేమలతతో పాటు కుటుంబ సభ్యులు పల్లేర్ల భాగ్యలక్ష్మి, పల్లేర్ల మురళి, వాణి, సాయి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టి జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి అధ్యక్షుడు, టీపీసీసీ సాంస్కృతిక సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పేపర్ ప్లేట్లు, డిస్పోజబుల్ గ్లాసులకు బదులుగా మోదుగాకుల విస్తార్లలో భోజనం వడ్డిస్తూ పర్యావరణ హిత విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు గణేష్ కళాబృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు, భక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్రె స్వామి, నిమ్మల మల్లన్న, ఈసంపెల్లి సాయికుమార్, దూలం వెంకటేష్, నిమ్మల రమేశ్, 9వ వార్డు సభ్యుడు గంధం ప్రశాంత్, దూలం సురేష్, కొలిపాక ఎల్లయ్య, అమ్మ ఫౌండేషన్ సభ్యులు కాంతాల సంపత్ రెడ్డి, కర్రె వెంకటస్వామి, ఆలయ పూజారి నిమ్మల సదయ్య, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# గ్రామీణుల ఆరోగ్యానికి బాలవికాస చేయూత

- **వందల మందికి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా మందుల పంపిణీ..**
- **మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన**

**ఇల్లంతకుంట, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇల్లంతకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో హనుమకొండ లక్ష్మీనరసింహ లూమినస్ హాస్పిటల్ వైద్య బృందం సేవలందించి వందలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించింది.
శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గుత్తికొండ రమ్య-రవికుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆసుపత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ తగిన మోతాదులో మంచినీరు తాగడం అలవాటు చేసుకోవాలని, శరీరంలో నీటి కొరత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని సూచించారు.
హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ, మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు తమ ఆరోగ్యంపైనా సమాన శ్రద్ధ చూపాలని కోరారు. గర్భాశయ సంబంధిత సమస్యలు, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణపై మహిళలకు అవగాహన కల్పించారు.
కారోబర్ తిప్పారపు వీరన్న మాట్లాడుతూ, గ్రామ మహిళలు ఎదుర్కొంటున్న శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలను వైద్యులు ఓర్పుగా విని తగిన సూచనలు, సలహాలు అందించారని తెలిపారు. శిబిరంలో షుగర్, రక్తపోటు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు.
ఈ కార్యక్రమంలో జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, ఆసియా, హనుమకొండ లక్ష్మీనరసింహ లూమినస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సంకీర్తన, పీఆర్వో బిక్షపతి, సంపత్ రెడ్డి, రాజేష్, సిబ్బంది ప్రసన్న, భారతి, కృష్ణవేణి, గ్రామ ఉపసర్పంచ్ ఇంగ్లే లక్ష్మయ్య, గ్రామ కార్యదర్శి సుమలత, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి గౌడుగు మానసతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శనివారం - 01 - ఆగస్టు 2026




## జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినులకు యూనిఫార్మ్‌ల పంపిణీ

**తరిగొప్పుల,జులై31(తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వ యూనిఫార్మ్‌లను తరిగొప్పుల సర్పంచ్ అర్జుల జ్యోతి, మండల విద్యాశాఖ అధికారి జానకి, పంచాయతీ కార్యదర్శి తండ రాంబాబు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హెచ్ఐవీ నియంత్రణపై సమీక్ష

- **ఎయిడ్స్ సురక్ష హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించిన కలెక్టర్**



**ఆదిలాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమాల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగరాజు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలు తీరును వివరించారు. ముఖ్యంగా గర్భిణులు, నవజాత శిశువులకు వైరస్ సంక్రమణను నివారించడంలో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. గర్భిణులు, హెచ్ఐవీ బాధితులు తప్పనిసరిగా ఏఆర్‌టీ మందులను వినియోగించడం ద్వారా తల్లి నుంచి శిశువుకు వైరస్ సంక్రమణను గణనీయంగా అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పరీక్షలు, చికిత్సలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా 'ఎయిడ్స్ సురక్ష' హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. హెచ్ఐవీ నివారణ, చికిత్స, అవగాహన కార్యక్రమాల నిర్వహణలో ఈ హ్యాండ్‌బుక్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.
జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులకు పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాధన, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఈశ్వర్ రాజ్, ఏఆర్‌టీ వైద్యురాలు డా. పద్మిని ప్రియదర్శిని, సంబంధిత విభాగాల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ మడేలేశ్వరస్వామి బోనాలకు ఘన శ్రీకారం

* ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్
* ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ

**జమ్మికుంట, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీ మడేలేశ్వరస్వామి వారి బోనాల మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ మడేలేశ్వరస్వామి వారి అనుగ్రహంతో పట్టణ ప్రజలందరూ పాడిపంటలు సమృద్ధిగా పండించి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.
దేవాలయంలో ఇంకా కొన్ని మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉన్నాయని రజక సంఘం ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన మేరకు తనవంతు సహాయ



సహకారాలు అందించి, మరమ్మతు పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము, సంఘం నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.






# రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

- **డాక్టర్ పిడమర్తి రవి**

**మహబూబ్‌నగర్,జులై31(తెలంగాణ ముచ్చట్లు):** సెప్టెంబర్ 16న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో నిర్వహించనున్న రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు.ఈ మేరకు శనివారం షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, పరిగి, వికారాబాద్, చేవెళ్ల నియోజకవర్గాల ఉద్యమకారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1969 తెలంగాణ ఉద్యమం నుంచి 2009 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో ఈ మహాసమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు.
తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పింఛన్, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ నిర్దిష్ట గడువులో ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన ఉద్యమకారులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.
రెండు తరాల ఉద్యమకారులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చే ఈ అపూర్వ సమ్మేళనం తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని పేర్కొంటూ, రాష్ట్రంలోని ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎం.డి. రహీమ్, దిలీప్, బోరెల్లి సురేష్, రవి, శ్యాంసుందర్ రెడ్డి, మిట్ట యాదయ్య, లక్ష్మణ్, నాచ శ్రీనివాస్ యాదవ్, బోర్ర సురేష్, గడ్డమీది గోపాలకృష్ణ, అన్వర్, నక్క రమేష్, తాండూరు శ్రీనివాస్ తదితర తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వర్ రెడ్డి పదవీ విరమణ సన్మానోత్సవం

- **నలభై ఏళ్ల విద్యా సేవలకు వీడ్కోలు**
- **తాటికాయల ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి**





**ధర్మసాగర్,జులై31(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, వేలాది మంది చిన్నారులకు అక్షరజ్ఞానంతో పాటు విలువలను అందించిన తాటికాయల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొద్దిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా గ్రామం భావోద్వేగ వాతావరణంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికింది. సుదీర్ఘ ఉపాధ్యాయ సేవలకు గుర్తింపుగా నిర్వహించిన పదవీ విరమణ సన్మానోత్సవం ఆప్యాయత, అభిమానాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి పలు మండలాల మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వెంకటేశ్వర్ రెడ్డిని పూలదండలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడుతూ పలువురు జ్ఞాపికలు, సన్మాన పత్రాలు అందజేశారు. తాటికాయల ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సంయుక్తంగా ప్రత్యేక సన్మాన పత్రాన్ని అందజేసి, పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తు చేసుకుంది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని ఉపాధ్యాయులు కొనియాడారు.
ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మసాగర్ ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిని ఒక బాధ్యతగా కాకుండా సమాజ నిర్మాణానికి పవిత్రమైన సేవగా భావించి పనిచేసిన వ్యక్తి వెంకటేశ్వర్ రెడ్డి అని అన్నారు. ఉద్యోగ జీవితమంతా నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో సేవలందించి విద్యార్థులకు ఆదర్శప్రాయమైన గురువుగా నిలిచారని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని, ఆయన సేవా ప్రస్థానం మాత్రం కొనసాగాలని ఆకాంక్షించారు.
మాజీ ఎంఈఓ రాంధాన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని తన సొంత బిడ్డలా భావించి విద్యాబోధన చేసిన అరుదైన ఉపాధ్యాయుల్లో వెంకటేశ్వర్ రెడ్డి ఒకరని అన్నారు. విద్యాశాఖలో ఆయన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని, యువ ఉపాధ్యాయులకు ఆయన జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు.
స్థానిక సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ, గ్రామ పాఠశాల అభివృద్ధిలో వెంకటేశ్వర్ రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. పాఠశాలను గ్రామ గర్వకారణంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర విశేషమని, ఆయన పదవీ విరమణతో ఒక ఆదర్శ ప్రధానోపాధ్యాయుడి సేవలు ముగిసినా, ఆయన చూపిన మార్గం మాత్రం ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు.
మాజీ సర్పంచ్ పెసరు రమేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలతో కలిసి మమేకమై పని చేసిన ఉపాధ్యాయుడిగా వెంకటేశ్వర్ రెడ్డి ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేసిన సేవలకు గ్రామం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు.
అనంతరం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో సహకరించిన విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తాను చేసిన సేవలకు లభించిన ఈ గౌరవం జీవితాంతం మరువలేనిదని, విద్యార్థుల ప్రేమాభిమానాలే తనకు లభించిన గొప్ప బహుమతిగా భావిస్తున్నానని చెప్పారు.
విశేషంగా, అదే రోజున వెంకటేశ్వర్ రెడ్డి షష్టిపూర్తి కూడా కావడంతో కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచర ఉపాధ్యాయులు కలిసి షష్టిపూర్తి, పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం భావోద్వేగాల మధ్య ముగిసింది.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ రాంధాన్, స్థానిక సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి, మాజీ సర్పంచ్ పెసరు రమేష్, ఉప సర్పంచ్ పెసరు శివకృష్ణ, తాటికాయల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, పీఆర్టీయూ నాయకులు, వివిధ మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శనివారం - 01 - ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# చిక్కుడు గింజలతో ఆరోగ్యం

- **పోషకాలతో నిండిన సాంప్రదాయ ఆహారం**
- **గుండె, జీర్ణక్రియకు మేలు**
- **ఉడికించి తినడమే సురక్షితం**

చిక్కుడు గింజలు తెలుగు రాష్ట్రాల్లో విరివిగా ఉపయోగించే సాంప్రదాయ ఆహార పదార్థాల్లో ఒకటి. వీటిలో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, ఇనుము, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఉపయోగపడే ఈ గింజలను సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. చిక్కుడు గింజల్లో పీచు పదార్థాలు అధికంగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం సమస్య తగ్గడానికి తోడ్పడటంతో పాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. దీంతో బరువు నియంత్రణకు కూడా కొంతవరకు ఉపయోగపడవచ్చని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు కూడా పీచు పదార్థాలు సహాయపడతాయి. ప్రోటీన్లు సమృద్ధిగా ఉండటం వల్ల చిక్కుడు గింజలు కండరాల ఎదుగుదలకు, శరీర కణాల పునరుద్ధరణకు తోడ్పడతాయి. శాఖాహారులు ప్రోటీన్ అవసరాన్ని తీర్చుకోవడానికి ఇవి మంచి ఎంపికగా భావిస్తారు. ఇనుము, ఫోలేట్ వంటి పోషకాలు రక్తకణాల తయారీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. చిక్కుడు గింజల్లో ఉండే పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో కొంతవరకు సహాయపడుతుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించడంలో తోడ్పడతాయి. సమతుల్య ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే చిక్కుడు గింజలను పచ్చిగా తినకూడదు. వీటిలో ఉండే కొన్ని సహజ పదార్థాలు జీర్ణక్రియకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉంటుంది. అందువల్ల బాగా ఉడికించి మాత్రమే తినాలి. కొందరికి గ్యాస్ లేదా కడుపు ఉబ్బరం వంటి సమస్యలు ఉంటే తక్కువ మోతాదులో ప్రారంభించి క్రమంగా పెంచుకోవడం మంచిది.చిక్కుడు గింజలను కూర, పులుసు, సాంబారు, పులావ్ వంటి అనేక వంటకాల్లో ఉపయోగించవచ్చు. ఆకుకూరలు, ఇతర కూరగాయలు, ధాన్యాలతో కలిపి తీసుకుంటే మరింత సమతుల్యమైన పోషకాహారం లభిస్తుంది. సీజన్‌లో లభించే తాజా చిక్కుడు గింజలను పరిశుభ్రంగా వండి ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.



# నిమ్మగడ్డితో ముఖం మెరవాలా?

- **సహజ సంరక్షణకు నిమ్మగడ్డి**
- **నేరుగా రాస్తే చర్మానికి హాని కలిగే అవకాశం**
- **జాగ్రత్తగా ఉపయోగించాలని నిపుణుల సూచన**

నిమ్మగడ్డి (లెమన్‌గ్రాస్) చర్మాన్ని మెరిసేలా చేస్తుందని సామాజిక మాధ్యమాల్లో అనేక వీడియోలు ప్రచారంలో ఉన్నాయి. నిమ్మగడ్డి రసం లేదా నూనెను నేరుగా ముఖానికి రాస్తే చర్మం కాంతివంతంగా మారుతుందని కొందరు చెబుతున్నారు. అయితే దీనికి పరిమిత శాస్త్రీయ ఆధారాలే ఉన్నాయని చర్మవ్యాధి నిపుణులు పేర్కొంటున్నారు. చర్మానికి ఏ సహజ పదార్థాన్నైనా నేరుగా ఉపయోగించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నిమ్మగడ్డిలో యాంటీ ఆక్సిడెంట్లు, కొన్ని సుగంధ నూనెలు ఉంటాయి. ఇవి చర్మాన్ని శుభ్రంగా ఉంచడంలో కొంతవరకు సహాయపడవచ్చు. అలాగే నిమ్మగడ్డి టీ తాగడం వల్ల శరీరానికి తగినంత ద్రవాలు అందడం, సమతుల్య ఆహారంతో కలిసి ఆరోగ్యకరమైన చర్మానికి పరోక్షంగా ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే టీ తాగడం వల్ల మాత్రమే ముఖం వెంటనే మెరిసిపోతుందనే ఆధారాలు లేవు. నిమ్మగడ్డి నూనెను లేదా రసాన్ని నేరుగా ముఖంపై రాయడం సురక్షితం కాదు. ఇందులో ఉండే కొన్ని పదార్థాలు సున్నితమైన చర్మంలో మంట, దురద, ఎర్రబడడం లేదా అలర్జీకి కారణమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా సున్నిత చర్మం ఉన్నవారు లేదా చర్మవ్యాధులతో బాధపడుతున్నవారు స్వయంగా ప్రయోగాలు చేయకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖం సహజంగా కాంతివంతంగా ఉండాలంటే ప్రతిరోజూ ముఖాన్ని మృదువైన క్లెన్సర్‌తో శుభ్రం చేసుకోవడం, చర్మ తత్వానికి సరిపోయే మాయిశ్చరైజర్ ఉపయోగించడం, బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ రాసుకోవడం చాలా ముఖ్యం. అలాగే రోజూ తగినంత నీరు తాగడం, తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం, సరిపడా నిద్రపోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతి సహజ చిట్కా అందరికీ ఒకే విధంగా పనిచేయదు. ఒకరికి మేలు చేసిన పదార్థం మరొకరికి అలర్జీ కలిగించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఏదైనా కొత్త పదార్థాన్ని ఉపయోగించే ముందు చేతిపై చిన్న ప్రాంతంలో పరీక్షించి, ఎలాంటి ఇబ్బంది లేకపోతే మాత్రమే ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.నిమ్మగడ్డి చర్మ సంరక్షణలో కొంతవరకు ఉపయోగపడే లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ, ముఖం మెరవడానికి ఇది అద్భుత ఔషధం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సమతుల్య ఆహారం, సరైన చర్మ సంరక్షణ, తగినంత నీరు, నిద్ర వంటి ఆరోగ్యకరమైన అలవాట్లే దీర్ఘకాలం చర్మాన్ని కాంతివంతంగా ఉంచేందుకు ఉత్తమ మార్గమని వారు సూచిస్తున్నారు.

# మొలకలతో మేలెంతో

మొలకలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారాల్లో ఒకటిగా పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. పెసలు, శనగలు, అలసందలు, ఉలవలు వంటి పప్పుధాన్యాలను మొలకెత్తించిన తర్వాత వాటిలో పోషక విలువలు మరింత పెరుగుతాయి. అందుకే పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ వారంలో కొన్ని రోజులు మొలకలను ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొలకలు ప్రోటీన్లు, పీచు పదార్థాలు, విటమిన్‌సి, బి విటమిన్లు, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. మొలకెత్తే ప్రక్రియలో పప్పుధాన్యాల్లోని కొన్ని పోషకాలు శరీరానికి మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయి. దీంతో జీర్ణక్రియ కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. మొలకల్లో పీచు అధికంగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి ఇవి మంచి ఆహారంగా ఉపయోగపడతాయి. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు కూడా కొంతవరకు సహాయపడతాయి. అయితే మధుమేహం ఉన్నవారు తమ ఆహార ప్రణాళికకు అనుగుణంగా వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.మొలకల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను రక్షించడంలో తోడ్పడతాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి. గుండె ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు కూడా మొలకల్లో ఉండటంతో సమతుల్య ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.మొలకలను ఇంట్లోనే పరిశుభ్రంగా తయారు చేసుకోవడం ఉత్తమం. ఎక్కువసేపు బయట ఉంచితే బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు పచ్చి మొలకల కంటే స్వల్పంగా ఆవిరిలో ఉడికించిన లేదా తేలికగా ఉడికించిన మొలకలను తీసుకోవడం మరింత సురక్షితమని నిపుణులు సూచిస్తున్నారు.మొలకలను సలాడ్‌గా, ఉప్మా, పులావ్, కూరలు లేదా అల్పాహారంలో భాగంగా తీసుకోవచ్చు.

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

- **ఆగస్టు 10 వరకు ఓటరు వివరాల సేకరణ**
- **ఆగస్టు 17న ముసాయిదా జాబితా విడుదల**
- **సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు**
- **అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురణ**



**హైదరాబాద్, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం మరింత సమయం కల్పించింది. ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో కార్యక్రమం గడువును పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా షెడ్యూల్ ప్రకారం ఓటర్లు తమ వివరాలను ఆగస్టు 10వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులకు అందజేయవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో ఖచ్చితత్వంతో రూపొందించేందుకు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సంఘం సూచించింది. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, చిరునామా మారిన వారు, పేర్లలో సవరణలు అవసరమైన వారు, ఇతర మార్పులు చేయించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నారు. అవసరమైన పత్రాలను పరిశీలించి, నమోదు, సవరణ, తొలగింపు వంటి అంశాలను నిబంధనల మేరకు నమోదు చేయనున్నారు. ప్రజలు కూడా బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించి సరైన సమాచారాన్ని అందించాలని ఎన్నికల సంఘం కోరింది. సేకరించిన వివరాల ఆధారంగా ఆగస్టు 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అనంతరం సెప్టెంబర్ 16వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనుంది. జాబితాలో పేరు లేకపోవడం, తప్పులు ఉండడం, అనర్హుల పేర్లు నమోదవడం వంటి అంశాలపై ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఇతరులు అభ్యంతరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోనున్నారు. అవసరమైన చోట క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి తుది నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం అక్టోబర్ 19వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఓటరు గడువులోపు తన వివరాలను ధ్రువీకరించుకోవాలని సూచించింది.

# కారుణ్య నియామకాలపై సుప్రీం తీర్పు

- **వివాహిత కుమార్తెలకూ అవకాశం**
- **సమానత్వ హక్కును పునరుద్ఘాటించిన ధర్మాసనం**
- **బీహార్ ప్రభుత్వ నిబంధనలు చెల్లవని స్పష్టం**
- **దరఖాస్తును మళ్లీ పరిశీలించాలని ఆదేశం**



**న్యూఢిల్లీ, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** కారుణ్య నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహిత అనే ఒక్క కారణంతో కుమార్తెకు కారుణ్య నియామకాన్ని నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. విడాకులు తీసుకున్న లేదా భర్త నుంచి విడిపోయిన కుమార్తెలకు మాత్రమే ఈ అవకాశం కల్పించే ప్రభుత్వ నిబంధనలు చెల్లవని తేల్చిచెప్పింది. బీహార్ ప్రభుత్వ 2014 విధానాన్ని సవాలు చేస్తూ సయారా ఖాతూన్, ఆమె కుమార్తె దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలే ధర్మాసనం విచారణ చేపట్టింది. తండ్రి మరణానంతరం కారుణ్య నియామకం కోసం చేసిన దరఖాస్తును బీహార్ ప్రభుత్వం, అనంతరం పాట్నా హైకోర్టు తిరస్కరించడంతో బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కుమారులు, కుమార్తెల మధ్య ఎలాంటి వివక్ష చూపినా అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ధర్మాసనం పేర్కొంది. వివాహం తర్వాత కుమార్తెకు పుట్టింటితో సంబంధం ఉండదని, ఆమె పూర్తిగా భర్తపైనే ఆధారపడుతుందని భావించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఇటువంటి వర్గీకరణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కును ఉల్లంఘిస్తుందని స్పష్టం చేసింది. కేవలం సాంకేతిక కారణాలను చూపుతూ కారుణ్య నియామక దరఖాస్తులను తిరస్కరించడం సరైన విధానం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మృతుడి సోదరుడు తొలుత అభ్యంతరం తెలిపినప్పటికీ, అనంతరం నిరభ్యంతర పత్రం సమర్పించిన అంశాన్ని కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. పాట్నా హైకోర్టు ఉత్తర్వులను, బీహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసింది. పిటిషనర్ దరఖాస్తును ఎనిమిది వారాల్లోగా మెరిట్ ఆధారంగా పునఃపరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. కారుణ్య నియామకాల విషయంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి, అవసరాలనే ప్రధాన ప్రమాణంగా పరిగణించాలే తప్ప అభ్యర్థి వివాహ స్థితిని ఆధారంగా చేసుకోరాదని సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా మరోసారి స్పష్టం చేసింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా కారుణ్య నియామకాల అమలుపై ప్రభావం చూపే అవకాశముంది.

# ఆవిష్కర్తలతో రాష్ట్రపతి భేటీ

- **రాష్ట్రపతి భవన్‌లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రదర్శన**




**న్యూఢిల్లీ, జూలై 31 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు చెందిన గ్రామీణ స్థాయి ఆవిష్కర్తలతో రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శనలో పరిశీలించి, వాటి పనితీరుపై ఆసక్తిగా తెలుసుకున్నారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలు సమాజ అవసరాలకు అత్యంత అనుకూలంగా ఉంటాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. స్థానిక అనుభవం, శాస్త్రీయ ఆలోచన, వ్యక్తిగత సృజనాత్మకతతో పాటు సామాజిక బాధ్యత కలిసినప్పుడే ప్రజలకు ఉపయోగపడే వినూత్న పరిష్కారాలు రూపొందుతాయని చెప్పారు. ప్రజల నిత్యజీవిత సమస్యలకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు అందించే సామర్థ్యం గ్రామీణ ఆవిష్కరణలకు ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటువంటి ఆవిష్కరణలు దేశ అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే తమ లక్ష్యంపై విశ్వాసంతో పనిచేస్తున్న ఆవిష్కర్తలను రాష్ట్రపతి అభినందించారు. వ్యక్తులు, కుటుంబాలు, సమాజ జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పంతో వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఆవిష్కర్తలకు ప్రోత్సాహం లభిస్తోందని, కొత్త ఆలోచనలకు తగిన వేదికలు ఏర్పడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. సృజనాత్మకత, పరిశోధన, సామాజిక బాధ్యతల సమన్వయంతో దేశ పురోగతి మరింత వేగవంతం అవుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వినూత్న ఆలోచనలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు అందించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధిలో గ్రామీణ ఆవిష్కర్తల పాత్ర ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు.



# క్షమించేస్తున్నాం.!

తోడేళ్ళన్ని కలిసి..
మా మీద,
కళ్ళేర్ర చేస్తున్నాయి.
గుంట నక్కల మంద..
మా చుట్టూ చేరి,
గుర్రు గుర్రు మంటున్నాయి.

వేటగాడు వేసిన
వలలో చిక్కుకొన్న బానిసలవి.
ఉచ్చులో ఇరుకున్న గొర్రెలవి.
పచ్చని అడవికి నిప్పంటించే నియంతని
నెత్తిన మోస్తూ.,
పంజరాల్ని బద్దలు కొట్టేందుకు
వచ్చిన మమల్ని
ద్వేషిస్తున్నాయి.

ఇవి..
ఊళ్ళు తగలబెడుతున్న వాడికి..
ఇంటి పెత్తనం అప్పజేప్పి
ఊడిగం చేస్తున్నాయి.
వాటికోసం నిలబడ్డ మమల్నేమో
నడి బజార్లో నిలబెట్టాయి.

ఇంతకీ
మేం చేసిన తప్పేంటా
అనుకుంటున్నారా..?
వీళ్ళ పిల్లల భవిష్యత్తుకో
భరోసా నడగడమే.
అందుకు బహుమతిగా
వీళ్ళిచ్చింది మాకు
భరింపరాని తిట్లు, నిందలు.

మాకూ
కోపంగానే వుంది వీళ్ళమీద.
వాళ్ళ మంచి కోరుకునే
మమల్ని అసహ్యించుకునే
వీళ్ళని చూస్తే
రోతగానే వుంది మాక్కూడా.

కానీ.,
బిడ్డల్ని కన్న తల్లులుగా
తొడబుట్టినోడి అక్కలుగా
మాలోని మాతృత్వం,
మమకారం
అక్కడున్న బిడ్డల కోసం తపిస్తుంది.

అందుకే
మమల్ని ఎంత హేళన చేసినా,
బూతులతో దూషించినా..
వాళ్ళు కడుపున కన్న పిల్లల్ని కూడా
మేము..
మా పొత్తిళ్ళల్లో పొదువుకుంటున్నాము.
రేపటి వాళ్ళ భవిష్యత్తు కోసం
నేడు
అన్నింటిని ఓర్చుకుంటున్నాం.

వాళ్ళు..
మా చావుని కోరుకొని
మాకు శాపానార్థాలు పెట్టినా సరే..
ఆ పిల్లల మొహాలు చూసి
మేము
ఆ మూర్ఖపు తల్లిదండ్రులను క్షమించేస్తు
న్నాం.!!

**- దియా విఘ్నేష్.**

శనివారం - 01 - ఆగస్టు 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రమ్యకృష్ణే బెస్ట్ ఫ్రెండ్.. ఆరోగ్యమే అసలైన సంపద: మధుబాల



ప్రముఖ నటి మధుబాల తన వ్యక్తిగత జీవితం, స్నేహితులు, ఆరోగ్యంపై గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినీ పరిశ్రమలో తనకు అత్యంత సన్నిహిత స్నేహితురాలు నటి రమ్యకృష్ణ అని పేర్కొంటూ, తమ స్నేహం కాలక్రమేణా మరింత బలపడిందని తెలిపారు.

పాఠశాల రోజుల నుంచే తనకు సన్నిహిత స్నేహితులు ఉన్నారని చెప్పిన మధుబాల, సినీ పరిశ్రమలో ఖుష్బూ, రాధిక, నృత్య దర్శకురాలు బృందా, డిజైనర్ అను వంటి వారితో కూడా మంచి అనుబంధం కొనసాగుతోందని వెల్లడించారు.

జీవితంలో స్నేహితులు ఉండటం ఎంతో ముఖ్యమని, వారితో మనసులోని విషయాలను పంచుకోవడం మానసిక ప్రశాంతతను ఇస్తుందని చెప్పారు.

రమ్యకృష్ణతో తమ అనుబంధం గురించి మాట్లాడుతూ, చిన్న వయసులో ఎక్కువగా నవ్వులు, సరదా, వేడుకలతో గడిపేవాళ్లమని, ఇప్పుడు జీవిత అనుభవాలు పెరగడంతో ఆరోగ్యం, జీవనశైలి, మానసిక ప్రశాంతత వంటి అంశాలపై ఎక్కువగా చర్చించుకుంటున్నామని తెలిపారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిపై ఇద్దరికీ ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని మధుబాల చెప్పారు. శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని ఇద్దరూ నమ్ముతారని, ఒకరికొకరు ఆరోగ్యానికి సంబంధించిన సూచనలు కూడా చేసుకుంటామని వెల్లడించారు.

తాను ఎక్కువగా కాఫీ తాగితే రమ్యకృష్ణ సరదాగా మందలిస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని గుర్తు చేస్తుందని చెప్పారు.

తన రోజువారీ దినచర్యలో ఉదయాన్నే నిద్రలేచి యోగా చేయడం తప్పనిసరి అని మధుబాల తెలిపారు. అలాగే శరీరానికి తగినంత నీరు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఆధునిక ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే జీర్ణ సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో తగినంత నీరు తాగడం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

సరైన జీవనశైలి, క్రమశిక్షణ, వ్యాయామం, తగినంత నీరు తీసుకోవడం వంటి అలవాట్లు పాటిస్తే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని మధుబాల సూచించారు.

# ఒక్క రోజులో రూ.39 లక్షల కోట్ల జంప్‌తో మైక్రోసాఫ్ట్ చరిత్ర




అమెరికా స్టాక్ మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని రికార్డును టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ నమోదు చేసింది. ఒక్క రోజులోనే కంపెనీ మార్కెట్ విలువ దాదాపు 450 బిలియన్ డాలర్లు (సుమారు రూ.39 లక్షల కోట్లు) పెరిగి కొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ చరిత్రలో ఏ నమోదిత సంస్థ కూడా ఒకే రోజులో ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ భారీ పెరుగుదలతో మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అత్యధిక మార్కెట్ విలువ కలిగిన పబ్లిక్ లిస్టెడ్ సంస్థగా మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దీంతో కృత్రిమ మేధస్సు చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియాను వెనక్కి నెట్టింది. త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించిన అనంతరం మైక్రోసాఫ్ట్ షేర్లు సుమారు 9 శాతం ఎగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులోనే భారీగా పెరిగింది. ఈ పెరుగుదల విలువ దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే ఎక్కువగా ఉండటం విశేషం. ఈ రికార్డు వెనుక ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ సేవల విభాగం. మార్కెట్ అంచనాలను మించి అజూర్ ఆదాయం పెరగడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత బలపడింది. గత కొంత కాలంగా కృత్రిమ మేధస్సు, డేటా సెంటర్లు, క్లౌడ్ మౌలిక వసతులపై కంపెనీ చేసిన భారీ పెట్టుబడులు ఫలితాల రూపంలో కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే త్రైమాసికాల్లో కూడా కృత్రిమ మేధస్సు ఆధారిత క్లౌడ్ సేవలకు డిమాండ్ బలంగానే కొనసాగుతుందని మైక్రోసాఫ్ట్ అంచనా వేయడం పెట్టుబడిదారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇటీవల టెక్నాలజీ సంస్థలు కృత్రిమ మేధస్సుపై పెట్టుబడులను తగ్గిస్తాయనే సందేహాలు వ్యక్తమైనప్పటికీ, మైక్రోసాఫ్ట్ ఫలితాలు ఆ అనుమానాలకు తెరదించాయి.

మైక్రోసాఫ్ట్ విజయంతో కృత్రిమ మేధస్సు రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న ఇతర దిగ్గజ సంస్థలైన ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్‌లపై కూడా మార్కెట్ విశ్వాసం పెరిగినట్లు ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

# ధరలు పెరిగినా తగ్గని యాపిల్ జోరు

ధరలు పెరుగుతున్నప్పటికీ యాపిల్ ఉత్పత్తులపై వినియోగదారుల ఆదరణ ఏమాత్రం తగ్గడం లేదని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. బలమైన బ్రాండ్ విలువ, విస్తృతమైన ఎకోసిస్టమ్, వినియోగదారుల విశ్వాసం కారణంగా యాపిల్ అమ్మకాలు స్థిరంగా కొనసాగుతున్నాయని విశ్లేషిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జూన్ త్రైమాసికంలో యాపిల్ 109.4 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నమోదు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 16 శాతం పెరిగింది. ఒక్కో షేరుపై లాభం 29 శాతం వృద్ధి చెంది 2.02 డాలర్లకు చేరుకుంది. ఈ ఫలితాలు కంపెనీ వ్యాపార విస్తరణకు నిదర్శనంగా నిలిచాయి. భారత్‌లోనూ యాపిల్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కొనసాగుతోంది. ముఖ్యంగా ఐఫోన్‌లతో పాటు మ్యాక్‌బుక్ నియోకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించిందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. సరఫరా పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ ఐఫోన్-17 సిరీస్‌పై మార్కెట్లో భారీ ఆసక్తి కనిపిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు మెమరీ చిప్‌లు, ఇతర విడిభాగాల తయారీ వ్యయం పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం కంపెనీ లాభాలపై పెద్దగా ప్రభావం కనిపించడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే రాబోయే రోజుల్లో సేవల విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు చైనా మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడం యాపిల్‌కు కీలకమని సూచిస్తున్నారు. తయారీ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఐఫోన్‌ల ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయినప్పటికీ యాపిల్ బ్రాండ్‌పై వినియోగదారుల్లో ఉన్న విశ్వాసం, ఆధునిక సాంకేతికత, ప్రీమియం సేవలు కంపెనీ అమ్మకాల జోరును కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in